క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ



గోపాల్‌పేట: ఏదుల మండలంలోని చెన్నారంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. గ్రామంలో మొత్తం 29 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, అందరూ పనులు ప్రారంభిస్తున్నారని తెలిపారు. గతంలో పేదలు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొన్నా ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించారు. రెండో విడతలో గ్రామానికి 30 నుంచి 40 ఇళ్ల వరకు మంజూరు చేస్తారన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్, రాంచందర్, శాంతయ్య, బీరయ్య, రాములు, గిరి, కుర్మయ్య, వెంకటమ్మ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారులకు ఆరోగ్య యాప్‌పై అవగాహన



వనపర్తి విద్యావిభాగం: కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశానుసారం మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో జిల్లా ఆరోగ్య యాప్ ప్రదర్శన కార్యక్రమం నిర్వహించినట్లు సాంకేతిక సమాచారం జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రామచంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా యాప్ డెవలపర్ ప్రభాస్‌మిత్రా, జిల్లా వైద్యాధికారులు, వివిధ ఆరోగ్య ప్రోగ్రాం అధికారులకు యాప్ ఫీచర్లు, వినియోగ విధానంపై సమగ్రంగా డెమో ఇచ్చారు. ఈ యాప్‌లో జిల్లాకు సంబంధించి మిషన్ మధుమేహ, క్షయవ్యాధి (టీబీ) సంబంధిత సమాచారం ఎలా నమోదు చేయాలి, ఫాలోఅప్‌లు ఎలా నిర్వహించాలి అనే విషయాలపై అవగాహన కల్పించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లె శ్రీనివాసులు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సాయినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణలో భాగస్వాములవుదాం



అమరచింత: దోమల నివారణకు ప్రజలు మున్సిపాలిటీ సిబ్బందికి సహకరించాలని, పరిసరాల పరిశుభ్రతలో ముందుండాలని ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ శశిధర్ కోరారు. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మూడో వార్డులో మంగళవారం మురుగుకాల్వల శుభ్రత, పాత తొట్టిల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించుట, బ్లీచింగ్ చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టి పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, తప్పకుండా దోమతెరలు వాడాలని సూచించారు.

గంగమ్మ తల్లికి బోనాలు

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్‌లో మృగశిరకార్తీని పురస్కరించుకొని మంగళవారం గంగమ్మ తల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని చెరువులో గంగమ్మకు తెప్ప వదిలి, గ్రామ మహిళలు బోనాలతో ర్యాలీగా గంగమ్మ తల్లి గుడికి బయలుదేరి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గ్రామస్తులు సంతోషంగా ఉండడంతో పాటు పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. గంగమ్మ తల్లి గుడి నిర్మాణ దాత మిద్దె కృష్ణయ్యను మత్స్యకారులు ఘనంగా సన్మానించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత: కేసు నమోదు



పాన్‌గల్: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుబడిన ఘటనపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున మండలంలోని చిక్కేపల్లికి చెందిన పరశురాం ఇసుక తరలిస్తుండగా మండలంలోని వెంగళాయిపల్లి గ్రామ శివారులో గస్తీ తిరుగుతున్న పోలీసులు గమనించి ట్రాక్టర్‌ను ఆపి అనుమతులపై ఆరా తీశారు. అతడు ఎలాంటి అనుమతులు పత్రాలు చూపకపోవడంతో ఇసుక ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. పీసీలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ యజమాని పరశురాంపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీజనల్ వ్యాధులతో ప్రమాదం

- అప్రమత్తతే ఉత్తమ మార్గం
- పరిసరాల పరిశుభ్రత అవసరం
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



అచ్యుతాపురంలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన చేస్తున్న ఎంపీడీఓ, అధికారులు (ఫైల్)



పెబ్బేరు పట్టణంలో..

వనపర్తి రూరల్: వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. గ్రామాల్లో అపరిశుభ్రమైన వాతావరణం, కలుషితమైన నీరు, దోమలతో వ్యాధులు వేగంగా సంక్రమిస్తాయన్నారు. ముఖ్యంగా ఈ సీజన్‌లో డెంగీ, చికన్‌గున్యా, టైఫాయిడ్, మలేరియా, మెదడువాపు వంటి వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందుతాయి. చిన్నపాటి జాగ్రతలు తీసుకుంటే ఈ వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు. స్థానికంగా ఏఎన్‌ఎం, ఆశా, అంగన్‌వాడీ, ఎంఎల్‌హెచ్‌పీలతో కూడిన బృందాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే వైద్య అధికారులు సీజనల్ వ్యాధులపై వారానికి రెండు రోజులు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. మండలాల్లో పీహెచ్‌సీ, సబ్‌సెంటర్లలో వైద్యులు రోజు అందుబాటులో ఉండి రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సైతం అధికారులు, ప్రజలకు సూచించారు. ఇంటి పరిసరాల్లో నీటి హౌజులు, టైర్లు, డ్రమ్ముల్లో నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని అధికారులు ప్రజలకు సూచించారు.

తీసుకోవాల్సిన జాగ్రతలు

- మురుగు నీటి గుంతలు, ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వకుండా చూడాలి.
- శరీరం పూర్తిగా కప్పి ఉండేలా సాక్సులు, బూట్లు, ప్యాంట్లు, షర్టులు ధరించాలి.
- దోమలు ఇళ్లలోకి రాకుండా కిటికీలకు, తలుపులకు సన్నటి జాలీలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు దోమ తెరలు వాడాలి.

దోమలు కుట్టకుండా లేపనాలు రాసుకోవాలి.

- కాచి చల్లార్చిన నీటిని తాగాలి. ఇంటి ఆవరణలో ఖాళీ కొబ్బరి బొండాలు, వాడి పడేసిన టైర్లు ఉంచరాదు.
- పందులను జనావాస ప్రాంతాలకు దూరంగా ఉంచాలి.
- ఇంట్లో కూలర్లలో నీటిని ప్రతి మూడు రోజులకొకసారి మార్చుకోవాలి.

మండలం	జనాభా	సబ్ సెంటర్	పీహెచ్‌సీలు	వైద్యులు	సూపర్ వైజర్లు	స్టాఫ్ నర్సులు	టీఏ	ఓపీ
వనపర్తి	1,08521	8	1	1	3	4	1	75-80
శ్రీరంగాపురం	19441	6	1	2	2	3	0	50-60
పెబ్బేరు	48,749	7	1	2+1	2	4	1	150

అశ్రద్ధ చూపొద్దు

ప్రజలు పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చు. వర్షాకాలంలో ప్రజలు ఎలాంటి జ్వరమైనా అశ్రద్ధ చేయకుండా ముందుగా వైద్యుడిని సంప్రదించాలి. దోమతెరలు వినియోగిస్తే మంచి ఫలితం ఉంటుంది.

– డాక్టర్ రాకేష్‌రెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్, కదుకుంట్ల

రేమద్దులలో సమగ్ర ఆరోగ్య వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకున్న వారి వివరాలను పరిశీలిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

పాన్‌గల్: మండలంలోని వివిధ సబ్‌సెంటర్ల పరిధిలో కొనసాగుతున్న సమగ్ర ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని రేమద్దుల సబ్‌సెంటర్ పరిధిలో జిల్లాలోని అనుభవజ్ఞులైన వైద్య బృందం, ఎన్జీఓ టీమ్ సభ్యుల సహకారంతో డయాబెటిస్, బీపీ, హిమోగ్లోబిన్, క్షయవ్యాధి నిర్ధారణకు స్పూటమ్ సేకరణ, ర్యాండమ్ బ్లడ్ పరీక్షలు, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, హెపటైటీస్–బీ మొదలగు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు లారెన్స్, తారశశాంక్, వైద్య సిబ్బంది శాంతమ్మ, రాంచందర్, సతీష్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి



వనపర్తిటౌన్/ఖిల్లాఘనపురం: బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా ఖిల్లాఘనపురం మండలంలోని ఆగారం గ్రామానికి చెందిన ఎండీ అక్బర్‌పాషా నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మైనార్టీ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఖలీల్ అక్బర్‌పాషాకు నియామకపత్రం అందజేశారు. అనంతరం అక్బర్‌పాషాను బీజేపీ నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అక్బర్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బాసెట్టి శ్రీనివాసులు, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కాటమోని కృష్ణగౌడ్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గంధం ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొన్ని శక్తులు అడ్డుకుంటున్నాయి

చిన్నంబావి: కొల్లపూర్ నియోజకవర్గంతో పాటు చిన్నంబావి మండలంలో బీజేపీ ఎదుగదలను కొన్ని శక్తులు కావాలనే అడ్డుకుంటున్నాయని ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు జగ్గారి శ్రీధర్‌రెడ్డి అన్నా రు. గడిచిన పార్లమెంట్ ఎన్నికల్లో తన సొంత కష్టంతో ఏడు గ్రామ పంచాయతీల్లో అధికార పార్టీకి పో టీగా ఓట్లు తీసుకొచ్చానని, అటువంటి తనపై ని యోజకవర్గ నాయకత్వం కుట్ర పన్ని పార్టీకి దూరం చేసే కుట్ర పన్నుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గడచిన ఐదేళ్లుగా పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసి బలోపేతం చేస్తే ఈ రోజు ఓర్వలేకపోతున్నారని వాపోయారు. పదవీ ఉన్నా లేకున్నా ప్రజల కోసం సేవ చేసేందుకు కృషి చేస్తానన్నారు.

రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేయాలి



ఆర్‌ఐ గోపాల్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐకేఎస్ జిల్లా కోశాధికారి వెంకటేష్

అమరచింత: రుణమాఫీ కాని రైతులకు పూర్తి స్థాయిలో రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని ఏఐకేఎస్ జిల్లా కోశాధికారి వెంకటేష్ కోరారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఏఐకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్‌ఐ గోపాల్‌కు అందించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న భూ సమస్యలను భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా వెంటనే పరిష్కరించాలని కోరారు. రుణమాఫీ నేటికి 50 శాతం మంది రైతులకు కాలేదని, వాటిని పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. సన్నరకం వడ్లకు చెల్లించే బోనస్‌ను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో రాజు, అంజిరెడ్డి, రఘు, మోహన్, శంకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణతోనే జీవ మనుగడ



వనపర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, లెక్చరర్లు

వనపర్తి విద్యావిభాగం: మొక్కల సంరక్షణతో జీవ మనుగడ సాధ్యమవుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కో ఎడ్యుకేషన్) కళాశాల ప్రిన్సిపాల్ రఘునందన్ అన్నారు. మంగళవారం డిగ్రీ మూడో సంవత్సరం పూర్తి చేసిన బీఏ విద్యార్థులు అధ్యాపకులతో కలిసి కళాశాల ఆవరణలో వీడ్కోలు సమావేశంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో లెక్చరర్లు వీరన్న నాయక్, అంజి, సంధ్య,సంతోషి, ప్రశాంత్, వరప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ధామ్‌సింగ్, వెంకటస్వామి, యాదగిరిగౌడ్, మల్లికార్జున్, రామకృష్ణమూర్తి, సునీతబాయి, రాఘవేంద్ర, రంజిత్, విద్యార్థులు పాల్గొన్నారు.



రాజపేటలో..

నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

వనపర్తి రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న నర్సరీల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ రాఘవ అన్నారు. మంగళవారం మండలంలోని రాజపేటలో ఆయన పర్యటించి, నర్సరీని పరిశీలించి పెద్ద మొక్కలను అవెన్యూ ప్లాంటేషన్‌కు వాడే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా వన మహోత్సవంలో భాగంగా శ్మశాన వాటికలో కమ్యూనిటీ ప్లాంటేషన్ పనిని పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి రాఘవేంద్ర, క్షేత్ర సహాయకుడు నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ఖిల్లాఘనపురం: మండలంలోని దొంతికుంటతండా స్టేజీ వద్ద ఉన్న తెలంగాణ మోడల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న హిందీ ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారి ఉమాదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలోని 6వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులకు హిందీ బోధనకు ఎంపిక చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. డిగ్రీ, హిందీ పండిట్, టీఈటీ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని, అర్హులు ఈ నెల 19, 20వ తేదీల్లో నేరుగా పాఠశాలలో దరఖాస్తు చేయాలన్నారు. ఎంపికై న వారికి ప్రతి పిరియడ్‌కు రూ.182 చొప్పున చెల్లిస్తామని, నెలకు 100 పిరియడ్లు బోధించాలన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఖిల్లాఘనపురం: మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలోని పలు మండలాలతో పాటుగా ఖిల్లాఘనపురం మండలంలో ప్రైవేటు పాఠశాలలు చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తూ పేద విద్యార్థులను అధిక ఫీజుల పేరుతో వేధిస్తున్నారని మంగళవారం తెలంగాణ సామాజిక విద్యార్థి సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ లింగయ్యను కలిసి ఫిర్యాదు చేశారు. మండలాల్లో మధ్య తరగతి కుటుంబాలను ఆసరాగా చేసుకుని రూ.లక్షల ఫీజులు వసూలు చేయడంతో పాటుగా పాఠశాలల్లోనే నోట్‌బుక్‌లు, యూనిఫాంలు తదితర విద్యార్థులకు అవసరమయ్యే అన్ని రకాల వస్తువులను అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యాదగిరి, లక్ష్మణ్ ఉన్నారు.

వనపర్తి రూరల్: విద్యను వ్యాపారంగా మార్చిన ప్రైవేట్ పాఠశాల యజమానులపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరేషతేజ డిమాండ్ చేశారు. మంగళవారం పెబ్బేరు మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి అధిక ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం పేరుతో రూ.వేలు దండుకుంటున్నారని మండిపడ్డారు. అక్రమాలకు పాల్పడుతున్న పాఠశాలలపై విద్యాధికారులు తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా కన్వీనర్ సాతర్ల అర్జున్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివకుమార్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు హైదరాబాద్‌లో మందకృష్ణకు సన్మానం

వనపర్తి టౌన్: హైదరాబాద్‌లోని నాగోల్‌లోని శుభం గార్డెన్స్‌లో పద్మశ్రీ అవార్డు పొందిన మందకృష్ణ మాదిగకు గురువారం దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో సన్మానం జరగనుందని, జిల్లాలోని వికలాంగులు, పెన్షన్‌దారులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమన్వయకర్త గంధం గట్టయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో వీహెచ్‌పీఎస్ పట్టణ అధ్యక్షుడు లాగిశెట్టి కుశకుమార్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గంధం నాగరాజు, శ్రీనివాస్‌నాయుడు, చంద్రశేఖర్, గంధం కృష్ణయ్య, గంధం లక్ష్మయ్య, చంద్రయ్య, నాగేషు తదితరులు పాల్గొన్నారు

‘డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడుదాం’



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎంఈఓ బాలరాజు

ఆత్మకూర్: పట్టణాలు, గ్రామాల్లో విచ్చలవిడిగా యువత డ్రగ్స్‌కు బానిసలుగా మారుతున్నారని, డ్రగ్స్ మహమ్మారిని తరమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మండల విద్యాధికారి కొండాపురం బాలరాజు అన్నారు. మంగళవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో డగ్స్‌కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేసి ఉపాధ్యాయులకు అందజేశారు. పాఠశాల్లో విద్యార్థులకు, తల్లిదండ్రులకు డ్రగ్స్‌పై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నామని, యువత డ్రగ్స్, గంజాయి, మద్యం, జూదం తదితర చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ లక్ష్మి, సౌమ్యరాణి, కవితబాయి, శ్రీనివాసులు, బాలకృష్ణ, ఏఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ సారథ్యంలోనే సంస్కరణలు



మాట్లాడుతున్న గౌని వేమారెడ్డి

వనపర్తి రూరల్: దేశంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత బీజేపీ, ప్రధాని మోదీకి దక్కుతుందని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గౌని వేమారెడ్డి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో విజయవంతంగా 11 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు నాగరాజుయాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం పెబ్బేరు మండలంలోని రంగాపురంలో సమావేశం నిర్వహించారు. అనంతరం బీజేపీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే ఆధునీకరణ, రోడ్డు రవాణా సౌకర్యాలు కల్పించారన్నారు. ఆర్టికల్ 370 రద్దు, త్రిపుల్ తలాక్ తొలగింపు, కరోనా సమయంలో ఉచిత వ్యాక్సినేషన్, రేషన్‌షాపుల ద్వారా ఉచిత బియ్యం అందిస్తున్నారని కొనియాడారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా గ్రామపంచాయతీలకు నేరుగా నిధులు ఇచ్చి బలోపేతం చేశారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మాధవరెడ్డి, వెంకట్రామరెడ్డి, భగవంతుయాదవ్, ప్రకాశ్‌శెట్టి, దేవేందర్‌నాయుడు, గోవింద్‌నాయుడు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల సరఫరాను అరికట్టాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న

అమర చింత: వానాకాలం పంటలను సాగుచేస్తున్న రైతులకు మేలు రకమైన విత్తనాలను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలను చేపట్టడంతో పాటు నకిలీ విత్తనాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐయూకేఎస్ జిల్లా అధ్యక్షుడు రాజన్న డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో వానాకాలం సీజన్‌కు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు వ్యవసాయ పరికరాలు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని కోరారు. రైతు భరోసా కౌలు, పోడు భూములకు అమలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 14 రకాల పంటలకు మద్దతు ధర ప్రకటించడం కాకుండా అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రవికుమార్‌యాదవ్‌కు అందించారు. కార్యక్రమంలో ప్రసాద్, సామేలు, నాగరాజు, వెంకటేష్, ఆనంద్, మోహన్, ఆదాం, సుదర్శన్ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు పొగ నుంచి రక్షించండి



రాస్తారోకో చేస్తున్న కుట్టుమిషన్ మహిళలు

అమరచింత: పట్టణ శివారులోని డంపింగ్ యార్డులోని చెత్తను కాల్చడం ద్వారా వచ్చే పొగ నుంచి ఉపశమనం కల్పించాలని కోరుతూ మంగళవారం కుట్టుమిషన్ మహిళలు రోడ్డెక్కి రాస్తారోకో చేపట్టారు. పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న అమరచింత చేనేత ఉత్పత్తుల సంఘం ఆధ్వర్యంలో వివిధ పట్టణాల్లోని రెడిమేడ్ షోరూంల నిర్వాహకులు ఇచ్చిన ముడి సరుకులతో కొత్త డిజైన్‌లో బట్టలు కుట్టి అప్పగించే పనుల్లో సుమారు 40 మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు. కుట్టుమిషన్ భవనం సమీపంలోనే సెగ్రిగేషన్ షెడ్ ఉండటంతో పట్టణంలోని చెత్తను తీసుకొచ్చి వాటిలో వేయకుండా బయట వేసి తగులబెడుతున్నారని ఆరోపించారు. నిత్యం పొగ రావడంతో కుట్టు పనులు కొనసాగడం లేదని, ఆరోగ్యం దెబ్బతింటుందని మరికల్–ఆత్మకూర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టి తమ నిరసన తెలిపారు. వాహన రాకపోకలకు అంతరాయం కలగడంతో మున్సిపల్ మేనేజర్ యూసుఫ్ ఘటన స్థలానికి చేరుకొని విషయాన్ని కలెక్టర్‌కు విన్నవించి ప్రభుత్వ స్థలం ఎక్కడుందో తెలుసుకొని అక్కడికి తరలించే యత్నం చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

ప్రీ స్కూళ్లలో ఆటపాటలతో విద్య



దుప్పల్లిలో చిన్నారులతో అంగన్‌వాడీ సిబ్బంది



శ్రీరంగాపురంలో..

మదనాపురం: ‘అమ్మ మాట అంగన్‌వాడీ బాట’ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని దుప్పల్లి మూడో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల నమోదు కార్యక్రమాన్ని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఎస్ హెచ్‌ఎం సావిత్రమ్మ, అంగన్‌వాడీ టీచర్లు తారమ్మ, హంసమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

వనపర్తి రూరల్: పెబ్బేరు మండల కేంద్రంలోని ఎనిమిదో అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ రాధ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీడీపీఓ బాలీశ్వరి, సూపర్‌వైజర్ ఆసియా, హెచ్‌ఎం చెన్నరాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐదేళ్లు నిండిన చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించి చెంచువాడ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



దావాజిపల్లిలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు



కొన్నూరులో..

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా నూతన పద్ధతుల్లో బోధన సాగించాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని దావాజిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, దొండాయిపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్యపై ఆరా తీశారు. ప్రభుత్వ బడుల్లో అందుతున్న నాణ్యమైన విద్య, వసతులను తల్లిదండ్రులకు వివరించి విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కురుమూర్తినాయక్, శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాగుల అందజేత

కొత్తకోట రూరల్: మండలంలోని పాలెం బీసీ కాలనీ, ఎస్సీ వాడలో గల ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు జన సురక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు అందజేసినట్లు ఫౌండేషన్ నిర్వాహకులు దేవరకద్ర బాలన్న తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యుడు వెంకటేష్‌యాదవ్, బాలకృష్ణ, శ్రీశైలం, సత్యనారాయణ, రవి, శ్రీనివాసులు, రాజు తదితరులు ఉన్నారు.

మదనాపురం: మండలంలోని కొన్నూరు పీఎస్ పాఠశాలలోని 130 మంది విద్యార్థులకు జన సురక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పుస్తకాల బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివసాగర్, మహేష్, నాయిని రాములు, మహేష్, పుట్ట మొగిలి, రతన్లాల్, బాలు, రమేష్ తదితరులు ఉన్నారు.